సివిల్స్‌లో మెరిసిన పాలమూరు బిడ్డ

- అనన్య రెడ్డికి మూడో ర్యాంకు
- తొలి ప్రయత్నంలోనే విజయం
- కోచింగ్ తీసుకోకుండానే సత్తా
- 40 మందికిపైగా మనోళ్లకు ర్యాంకులు
- యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల వెల్లడి
- యూపీకి చెందిన ఆదిత్యకు ఫస్ట్‌ర్యాంకు
- 1,016 మంది అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉన్న సీఎస్‌బీ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో మంగళవారం యూపీఎస్సీ సివిల్స్‌లో ర్యాంకులు సాధించినవారితో కేక్ కట్‌చేస్తున్న అకాడమీ డైరెక్టర్ బాలలత

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సివిల్స్ తుది ఫలితాల్లో తెలంగాణకు చెందిన అనన్యరెడ్డి సత్తాచాటారు. తొలి ప్రయత్నంలోనే అసమాన ప్రతిభ కనబర్చి మూడో ర్యాంకు సాధించారు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే పాలమూరు బిడ్డ అనన్య.. ఆలిండియా 3వ ర్యాంకుతో మెరిశారు. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన సివిల్స్ పరీక్షల తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మంగళవారం ప్రకటించింది. ఈ ఫలితాల్లో ఆదిత్య శ్రీవాస్తవ (27) మొదటి ర్యాంకు, అనిమేశ్ ప్రధాన్(24) రెండో ర్యాంకు సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు చెందిన 22 ఏండ్ల అనన్యరెడ్డి మొదటి ప్రయత్నంలోనే మూడో ర్యాంకు సాధించారు. పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్(27) నాలుగో ర్యాంకు, రుహాణి(28) ఐదో ర్యాంకు సాధించారు. ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్, ఐపీఎస్‌తోపాటు సివిల్ సర్వీసులు, గ్రూప్-ఏ, గ్రూప్ బీ సర్వీసులు కలిపి జాతీయ స్థాయిలో మొత్తం 1,016 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇందులో 664 మంది పురుషులు, 352 మంది మహిళలు ఉన్నారు. టాప్ 25 ర్యాంకర్లలో 10 మంది మహిళలు కాగా 15 మంది పురుషులు ఉన్నారు. ర్యాంకులు సాధించినవారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు 40 మందికిపైగా ఉన్నట్టు తెలిసింది. జాతీయ స్థాయిలో నందల సాయికిరణ్ 27వ ర్యాంకు, మెరుగు కౌశిక్ 82వ ర్యాంకు, ప్రస్తుతం ఢిల్లీలో ఏసీపీగా ఉన్న సిద్దిపేట జిల్లా కొండపాకవాసి బుద్ధి అఖిల్‌యాదవ్ 321 ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. సివిల్స్‌లో మెరిసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి ఈసారి 50పైగా అభ్యర్థులు సివిల్స్‌కు ఎంపిక కావడం పట్ల సీఎం ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన పాలమూరు బిడ్డ దోనూరి అనన్యరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గత ఏడాది ఐపీఎస్.. ఇప్పుడు ఐఏఎస్

సివిల్స్ ఫలితాల్లో మొదటి ఐదు ర్యాంకులు సాధించిన వారిలో ముగ్గురు 2022లోనూ సివిల్స్‌లో ఉత్తీర్ణులయ్యారు. 2022 సివిల్స్ పరీక్షలో ఆదిత్య శ్రీవాస్తవ 236వ ర్యాంకు, పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్ 121వ ర్యాంకు, రుహాణి 159వ ర్యాంకు సాధించారు. ఈ ముగ్గురు గత ఏడాదే ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.

బరిలో 10 లక్షలు.. వెయ్యి మంది ఎంపిక

సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష గత ఏడాది మే 28న జరిగింది. ఈ పరీక్షకు 10,16,850 మంది దరఖాస్తు చేసుకోగా 5,92,141 మంది హాజరయ్యారు. వీరిలో 14,624 మంది మెయిన్ పరీక్షకు అర్హత సాధించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన మెయిన్ పరీక్షలో 2,855 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. వీరిలో 1,016 మంది తుది ఫలితాల్లో ఉత్తీర్ణులయ్యారు. 347 మంది జనరల్ క్యాటగిరీలో, 115 మంది ఆర్థికంగా వెనుకబడినవర్గాల (ఈడబ్ల్యూఎస్) క్యాటగిరీలో, 303 మంది ఓబీసీ, 165 మంది ఎస్సీ, 86 మంది ఎస్టీ క్యాటగిరీల నుంచి ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను http:// www.upsc.gov.in వెబ్‌సైట్‌లో యూపీఎస్సీ అందుబాటులో ఉంచింది. 15 రోజుల్లోగా మార్కుల వివరాలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ప్రకటించింది.

ఉద్యోగం వదిలి..ఫస్ట్ ర్యాంకు సాధించి

సివిల్స్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన ఆదిత్య శ్రీవాస్తవ స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో. ఆయన తండ్రి అజయ్ శ్రీవాస్తవ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. చిన్ననాటి నుంచి చదువుల్లో ముందుండే ఆదిత్య 12వ తరగతిలో 95 శాతం మార్కులు సాధించారు. ఐఐటీ కాన్పూర్ నుంచి బీటెక్, ఎంటెక్ పూర్తి చేశారు. 2019లో ఆయన బెంగళూరులోని గోల్డ్‌మెన్ శాక్స్‌లో ఉద్యోగం సాధించారు. 15 నెలలపాటు కార్పొరేట్ విధులు నిర్వర్తించి, లక్షల్లో వేతనం అందుకున్న తర్వాత ఆయన సివిల్స్‌పై ఆసక్తితో ఉద్యోగాన్ని వదులుకొని ఇటు వైపు అడుగులు వేశారు. 2022లోనూ ఆయన సివిల్స్‌లో 236వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. చదువు పూర్తయ్యాక ఆర్థిక భద్రత సాధించాలనే ఆలోచనతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరానని, అయితే డబ్బు మాత్రమే అంతిమ ప్రేరణ కాదని గ్రహించి సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవ్వాలని నిర్ణయించుకున్నట్టు ఆదిత్య తన మాక్ ఇంటర్వ్యూలో తెలిపారు. అట్టడుగు స్థాయిలో ప్రభావం చూపడానికి, వ్యవస్థకు తన వంతు సహకారాన్ని అందించడానికి ఇది ఒక మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు

ఐపీఎస్ వదిలి.. ఐఏఎస్ సాధించా

16వ ర్యాంకర్ అయాన్ జైన్

గతేడాది సివిల్స్‌లో ఐపీఎస్ వచ్చినా చేరకుండా ఈ ఏడాది ఐఏఎస్ సాధించానని ఢిల్లీకి చెందిన అయాన్ జైన్ తెలిపారు. మంగళవారం యూపీఎస్సీ ప్రకటించిన సివిల్స్-2023 ఫలితాల్లో ఆల్ ఇండియా 16వ ర్యాంక్ సాధించిన అయాన్ ఫోన్‌లో 'నమస్తే ప్రతినిధి'తో మాట్లాడారు. ఢిల్లీలోనే విద్యాభ్యాసమంతా పూర్తి చేసినట్టు అయాన్ చెప్పారు. ఐఐటీ ఢిల్లీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించానని తెలిపారు. రెండో ప్రయత్నంలో ఐపీఎస్ వచ్చినప్పటికీ ఐఏఎస్ వైపే దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. మ్యాథ్స్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకొని సివిల్స్‌లో ర్యాంకు పొందానని చెప్పారు. సివిల్స్ రాయాలనుకొనే వారు మొదట పరీక్షను విశ్లేషించుకోవాలని, తర్వాత అవగాహన ఏర్పర్చుకుని ప్రిపరేషన్ కొనసాగిస్తే విజయం సాధించవచ్చని ఆయన సూచించారు.

వ్యవసాయ కుటుంబం నుంచి ఐఏఎస్‌గా

అనన్యరెడ్డికి అభినందనల వెల్లువ

తల్లిదండ్రులతో దోనూరు అనన్యరెడ్డి

మూసాపేట (అడ్డాకుల) ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన దోనూరు అనన్య రెడ్డి మొదటి ప్రయత్నంలోనే ఆలిండియా మూడో ర్యాంకు సాధించడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. దోనూరు మంజుల, సురేశ్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. వారికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్దమ్మాయి అనన్య. ఆమె మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ పాఠశాలలో ప్రాథమిక విద్య, కాకతీయ పాఠశాలలో ప్రాథమికోన్నత విద్య, గీతం పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించింది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నారాయణ ఐఏఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. ఢిల్లీలోని మిరిండా హౌస్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ కళాశాలలో విద్యనభ్యసించింది. అనన్యరెడ్డితోపాటు ఆమె తల్లిదండ్రులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

చిన్నప్పటి నుంచే ఐఏఎస్ కావాలనుకున్నా..

చిన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగి అయిన తాతయ్యతో మాట్లాడుతున్నప్పుడే భవిష్యత్తులో ఐఏఎస్ కావాలనుకున్న. మా నాన్న సురేశ్‌రెడ్డి వ్యవసాయంతోపాటు బిజినెస్ చేస్తున్నారు. అమ్మ మంజుల గృహిణి. డిగ్రీ నుంచే సివిల్స్ వైపు దృష్టి పెట్టాను. ఆంత్రోపాలజీ ఆప్షనల్ సబ్జెక్టుగా సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాను. ప్రతిరోజు 12 నుంచి 14 గంటలపాటు పుస్తకాలతో కుస్తీ పట్టాను. మంచి ర్యాంక్ సాధిస్తానని నమ్మకం ఉండేది. కానీ, మూడో ర్యాంక్ వస్తుందని ఊహించలేదు. చిన్నప్పటి నుంచే సామాజిక సేవ చేయాలనే తపన ఉండటంతో సివిల్స్ వైపు అడుగులు వేశా. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే ఈ సక్సెస్ సాధ్యమైంది.

-అనన్యరెడ్డి, సివిల్స్ 3వ ర్యాంకర్

సివిల్స్ సాధించిన తెలుగు అభ్యర్థులు వీరే..

క్రమసంఖ్య పేరు	ఆలిండియా ర్యాంకు
1 దోనూరు అనన్యరెడ్డి	3
2 నందల సాయికిరణ్	27
3 మెరుగు కౌశిక్	82
4 పెంకీసు ధీరజ్‌రెడ్డి	173
5 జీ అక్షయ్ దీపక్	196
6 భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ	198
7 బుద్ధ అఖిల్	321
8 నిమ్మనపల్లి ప్రదీప్‌రెడ్డి	382
9 బన్న వెంకటేశ్	467
10 కడుమూరి హరిప్రసాద్ రాజు	475
11 పూల ధనుశ్	480
12 కే శ్రీనివాసులు	526
13 నెల్లూరు సాయితేజ	558
14 కిరణ్ సాయింపు	568
15 మర్రిపాటి నాగభరత్	580
16 పోతుపురెడ్డి భార్గవ్	590
17 కే అర్పిత	639
18 ఐశ్వర్య నెల్లిశ్యామల	649
19 సాక్షి కుమారి	679
20 చౌహాన్‌కుమార్	703
21 గాదె శ్వేత	711
22 వీ ధనంజయ్‌కుమార్	810
23 లక్ష్మీ బానోతు	828
24 ఆదా సందీప్‌కుమార్	830
25 జే రాహుల్	873
26 హనిత వేములపాటి	887
27 కే శశికాంత్	891
28 కేసారపు మీన	899
29 రావూరి సాయి అలేఖ్య	938
30 గోవద నవ్యశ్రీ	995

విద్యా - ఉద్యోగ సమాచారం

ఎల్‌పీసెట్ గడువు 26కు పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వారికి పాలిటెక్నిక్ కోర్సుల్లో ల్యాటరల్ ప్రవేశాలకు నిర్వహించే ఎల్‌పీసెట్ దరఖాస్తు గడువును ఈ నెల 26 వరకు పొడిగించినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం దరఖాస్తు గడువు ముగియగా, మరో అవకాశం ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

జాబ్ మేళాలో 289 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. సాంకేతిక విద్యాశాఖ, టీఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాకు 700 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 289 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముందుగా, ఈ జాబ్‌మేళాను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ప్రారంభించారు. హీ మెయిర్ ఇండియా లిమిటెడ్, వెంటో, స్పెక్ట్రమ్ క్వెస్ట్, మైక్రోసాఫ్ట్, రిలయన్స్ జియో, డాక్టర్ రెడ్డీస్, షిండ్లర్ అండ్ ప్రీమియర్ ఎనర్జీస్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి.

ఈసెట్‌కు 23వేలకుపైగా దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్‌లో ల్యాటరల్ ఎంట్రీ కోసం నిర్వహించే టీఎస్ ఈసెట్‌కు ఈ ఏడాది 23,367దరఖాస్తులొచ్చాయి. మంగళవారం గడువు ముగియగా, ఆలస్య రుసుముతో ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 24 నుంచి 28 వరకు దరఖాస్తులను సవరించుకోవచ్చు. మే 1 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌చేసుకొనే అవకాశముండగా, మే 6న ఈసెట్ పరీక్ష నిర్వహిస్తారు.

కనీస అర్హత మార్కులపై జోక్యం చేసుకోలేం

- ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామకంపై హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక స్థాయిలో 796 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల నియామకానికి అర్హతగా నిర్ణయించిన కనీస మార్కుల విషయంలో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎన్సీటీఈ నిబంధనలకు అనుగుణంగా జారీ చేసిన నోటిఫికేషన్‌లో జోక్యానికి ఆస్కారం లేదని స్పష్టం చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) క్యాటగిరీలోని ఈ పోస్టులకు పోటీపడే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో 45%, ఇతర అభ్యర్థులు 50% మార్కులు సాధించడంతోపాటు డీఈడీ పూర్తిచేసి ఉండాలన్న జీవో 4కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం కొట్టివేసింది.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

బాసర/తౌగుట, ఏప్రిల్ 16 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొగుట మండలం బండారుపల్లికి చెందిన బుచ్చక్క అరవింద్ (16) బాసరలో పీయూసీ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం ఉదయం హాస్టల్ గదిలో ఉన్న తోటి విద్యార్థులు తరగతి గదులకు వెళ్లగా అరవింద్ మాత్రం గదిలోనే ఉండిపోయాడు. ఎవరూ లేని సమయం చూసి హాస్టల్ గదిలో ఉరి వేసుకున్నాడు. అనంతరం గదిలోకి వచ్చిన తోటి విద్యార్థులు గమనించి సిబ్బందికి, అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అరవింద్‌ను ట్రిపుల్ ఐటీలోని దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హాజరు శాతం తక్కువగా ఉండటంతో ఈనెల 18 నుంచి మే 2 వరకు జరిగే పరీక్షలకు విద్యార్థి అరవింద్‌ను బాసర ట్రిపుల్ ఐటీ అధికారులు అనుమతించ లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అరవింద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తున్నది. అయితే విద్యార్థి వ్యక్తిగత కారణాలతో మృతి చెందినట్టు అధికారులు పేర్కొన్నారు. సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపడుతున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకీ షర్మిల సీరియస్ అయ్యారు. ట్రిపుల్ ఐటీని పరిశీలించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.

అప్పుడు ఐపీఎస్.. ఇప్పుడు ఐఏఎస్

కొండపాక అఖిల్‌యాదవ్‌కు 321 ర్యాంకు

కొండపాక (కుకునూరుపల్లి), ఏప్రిల్ 16: సిద్దిపేట జిల్లా కొండపాక గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన బుద్ధి అఖిల్‌యాదవ్ సివిల్స్ ఫలితాల్లో 321వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాడు. ఈయన 2021లో తొలి ప్రయత్నంలోనే 566 ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ఐపీఎస్ శిక్షణ పొంది ప్రస్తుతం ఢిల్లీలో ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరవుతూ ఇప్పుడు 321వ ర్యాంకుతో సత్తాచాటాడు. 'చిన్నప్పటి నుంచి కన్న కలను సాకారం చేసుకున్న. నా విజయానికి, నన్ను లక్ష్యం వైపు నడిపించిన నా తల్లిదండ్రులకు, గురువులకు రుణపడి ఉంటా. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా నన్ను చదివించడానికి అమ్మానాన్న వెనుకంజ వేయలేదు. నేను చదువుకోవడంలో ఇబ్బందులు పడకుండా నా తమ్ముడు నాపై చూపిన ప్రేమను మరువలేను. ఆత్మస్థైర్యంతో చదివాను. నేటి యువకులు పట్టుబడితే ఏదైనా సాధించే సత్తా ఉన్నది. ఉన్నత లక్ష్యంతో బరిలోకి దిగితే విజయం సాధించడం ఖాయం' అని అఖిల్‌యాదవ్ తెలిపారు.

'వెలిచాల' సాయికిరణ్‌కు 27వ ర్యాంకు

కరీంనగర్‌వాసి సహనకు 739వ ర్యాంకు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా/ చొప్పదండి, ఏప్రిల్ 16: సివిల్స్ ఫలితాల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యర్థులు సత్తాచాటారు. రామడుగు మండలం వెలిచాలకు చెందిన నందల సాయికిరణ్ 27వ ర్యాంకు సాధించాడు. గ్రామంలోనే 5 వరకు చదివిన సాయి కిరణ్, 6 నుంచి 10వ తరగతి దాకా కరీంనగర్ తేజస్ స్కూల్‌లో, ఇంటర్ కరీంనగర్ ట్రినిటీ కళాశాలలో, బీటెక్ ఎన్ఐటీ వరంగల్‌లో పూర్తి చేశాడు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు.కరీంనగర్‌కు చెందిన కొలనుపాక సహన 739వ ర్యాంకు సాధించింది. సహన తండ్రి అనిల్ రిపోర్టర్ కాగా, తల్లి గృహిణి. కరీంనగర్‌లోని కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో టెన్త్ దాకా చదివి 9.8 గ్రేడ్ సాధించింది. ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీగాయత్రి కళాశాలలో 979 మార్కులతో పూర్తి చేసింది. హైదరాబాద్ లోని జేఎన్టీయూలో బీటెక్ కంప్లీట్ చేసి, ఢిల్లీలోని శ్రీరామ్స్ ఐఏఎస్ అకాడమీలో కోచింగ్ తీసుకున్నది. తాజా ఫలితాల్లో 739 ర్యాంకు సాధించింది.

స్మితా సబర్వాల్ నాకు ఆదర్శం



మా మమ్మీడాడీ ప్రోత్సహించడం వల్లే నేను యూపీఎస్సీ సివిల్స్‌లో ర్యాంకు సాధించా. స్మితా సబర్వాల్ మేడం కరీంనగర్‌లో కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఆమె వర్క్ నాకు నచ్చింది. అందుకే ఆమెను ఆదర్శంగా తీసుకున్నా. కలెక్టర్ కావాలని డిసైడ్ అయ్యా. మా పేరెంట్స్ సహకారంతో ప్రిపేర్ అయ్యాను. ఏ క్యాడర్‌లో జాయిన్ అయినా ఐఏఎస్ కావడమే నా లక్ష్యం. *- కొలనుపాక సహన, 739 ర్యాంకు*

నల్లగొండ జిల్లావాసి ధీరజ్‌రెడ్డికి 173వ ర్యాంకు

తిరుమలగిరి (సాగర్), ఏప్రిల్ 16: నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం అల్వాల గ్రామానికి చెందిన పెంకీస్ ధీరజ్‌రెడ్డి సివిల్స్‌లో ఆలిండియా 173వ ర్యాంకును సాధించాడు. పెంకీస్ సత్యనారాయణరెడ్డి హేమలత కుమారుడైన ధీరజ్‌రెడ్డి మూడో ప్రయత్నంలో విజయం సాధించడంతో తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. 'ఈ ర్యాంక్‌తో నాకు ఈ సారి ఐపీఎస్ లేదా ఐఆర్ఎస్ వస్తుంది. ఉద్యోగం చేసుకుంటూనే తిరిగి సివిల్స్‌కు ప్రిపేర్ అయి ఐఏఎస్ సాధిస్తా' అని ధీరజ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఆత్మకూరువాసికి 278వ ర్యాంకు

ఆత్మకూరు, ఏప్రిల్ 16: యూపీఎస్సీ 2023-24 ఫలితాల్లో వనపర్తి జిల్లా ఆత్మకూరువాసికి 278వ ర్యాంకు వరించింది. ఆత్మకూరు పట్టణానికి చెందిన సయ్యద్ ఖాసీమ్ (రిటైర్డ్ ఉపాధ్యాయుడు) మనుమరాలు ఎహెతదా ముఫాసిర్ 278 ర్యాంకు సాధించింది. మహబూబ్‌నగర్‌లో స్థిరపడిన సయ్యద్ ఇబ్రహీంఖలీల్ రెండో కూతురు ఎహెతదా ముఫాసిర్ చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో చదివింది. ఇంటర్ బైపీసీలో 987 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచి.. వైద్యవిద్యకు వెళ్లకుండా డిగ్రీ చదివింది. ఢిల్లీ యూనివర్సిటీ శ్రీరామ్ మహిళా కళాశాలలో పొలిటికల్ సైన్స్ చదివింది. ఎలాంటి కోచింగ్ లేకుండా తండ్రి సూచనలతో ఇంట్లోనే ప్రిపేర్ అయ్యింది. తాత బోధించిన విజ్ఞాన బోధనలు, కరెంట్ అఫైర్స్, పుస్తకాలను నిత్యం చదవడం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలిగినట్టు ఎహెతదా ముఫాసిర్ చెప్పారు.

ఉమ్మడి వరంగల్ జిల్లావాసులకు ర్యాంకుల పంట

- సివిల్స్‌లో మెరుగు కౌశిక్ 82, జయసింహారెడ్డికి 104,
- ప్రణయ్‌కు 554, కిరణ్‌కు 568,
- అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకులు

కౌశిక్ (82 ర్యాంకు)

జయసింహారెడ్డి (104 ర్యాంకు)

ప్రణయ్‌కుమార్ (554 ర్యాంకు)

కిరణ్ (568 ర్యాంకు)

హనుమకొండ/రఘునాథపల్లి/గీసుగొండ/జనగామ చౌరస్తా/చిక్కడపల్లి, ఏప్రిల్ 16: సివిల్స్ తుదిఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లావాసులకు ర్యాంకుల పంట పడింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారు. జనగామకు చెందిన బిల్డర్ మెరుగు సుధాకర్-సుజాత దంపతుల కుమారుడు కౌశిక్ ఆలిండియా 82వ ర్యాంకు సాధించాడు. ఓయూలో బీటెక్ పూర్తి చేసి ఢిల్లీలోని ఐఐఎఫ్‌టీలో ఎంబీఏ చదివిన అనంతరం.. సివిల్స్ కోచింగ్ తీసుకొని తొలి ప్రయత్నంలోనే 82వ ర్యాంకు సాధించాడు. 15 ఏండ్లుగా కౌశిక్ కుటుంబం హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసముంటున్నారు. మొదటి ప్రయత్నంలోనే 82వ ర్యాంక్ సాధించడం చాలా సంతోషంగా ఉన్నదని మెరుగు కౌశిక్ తెలిపారు. సివిల్స్ సాధించాలన్న తన పదేండ్ల కల సాకారమైందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రముఖ విద్యావేత్త అశోక్‌నగర్‌నగర్‌లో సీఎస్‌బీ అకాడమీ అధినేత్రి బాలలత మెంటర్‌గా అందించిన సూచనలు ర్యాంకు రావడానికి ఎంతో దోహదపడ్డాయని కౌశిక్ చెప్పారు. హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి 104వ ర్యాంకు సాధించాడు. ఈయన గతేడాది 217 ర్యాంకు రాగా, ఐపీఎస్ సాధించాడు. జయసింహారెడ్డి తండ్రి రావుల ఉమారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో సహ పరిశోధన సంచాలకుడిగా విధులు నిర్వహిస్తుండగా, తల్లి లక్ష్మి గృహిణి. జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన కొయ్యడ ప్రణయ్‌కుమార్ రెండో ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించారు. మండలకేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతులు కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. వారి మూడో కుమారుడైన ప్రణయ్‌కుమార్ గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్, కూకట్‌పల్లి జేఎన్టీయూలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదివాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్టడీ సర్కిల్లో చేరి కష్టపడి చదివాడు. గతేడాది 885వ ర్యాంకు సాధించాడు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు ప్రభాకర్-జయలక్ష్మీ కుమారుడు కిరణ్ గతంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్) అసిస్టెంట్ డైరెక్టర్, ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిగా అవకాశం వచ్చింది. చివరి ప్రయత్నంగా 568వ ర్యాంకు సాధించి తాను అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాడు. కాగా కిరణ్, 5వతరగతిలో జవహర్ నవోదయ ఎంట్రెన్స్ పరీక్ష రాసి వరంగల్ మమునూరులోని నవోదయ పాఠశాలలో చేరి పదవ తరగతి పూర్తి చేశాడు. అక్కడి నుంచి ఇంటర్ గుంటూరు భాష్యం కళాశాలలో పూర్తి చేసి, 2017లో ఢిల్లీ ఐఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. వరంగల్ శివనగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకు వచ్చింది.

హనిత ఆదర్శనీయం

వైకల్యాన్ని జయించి 887 ర్యాంకు

కవాడిగూడ, ఏప్రిల్ 16: ఏపీలోని విశాఖపట్నం జిల్లాకు చెందిన హనిత వేములపాటి దివ్యాంగులరాలైనప్పటికీ సివిల్ సర్వీసెస్‌లో 887 ర్యాంకుతో సత్తా చాటారు. తాను టెన్త్ వరకు వైజాగ్, ఇంటర్ ప్రిడ్జీలో చదివానని చెప్పారు. 2012లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుతున్న సమయంలో స్పైనల్‌కార్డ్ సమస్యల వల్ల రెండు కాళ్లు పోయాయని మీడియాకు వెల్లడించారు. ఐఐటీని వదిలేసి నిరాశ చెందకుండా ఇగ్నో దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసి తల్లిదండ్రులు రాఘవేందర్‌రావు, ఇందిర ప్రోత్సాహంతో సివిల్స్ ప్రిపేర్ అయ్యాయని చెప్పారు. నాలుగోసారి 887 ర్యాంకు సాధించినట్టు తెలిపారు. సివిల్స్ సాధించడం తనకెంతో సంతోషంగా ఉన్నదని చెప్పారు.

మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఏడీజీ మహేశ్ భాగవత్‌ను కలిసిన సివిల్స్ ర్యాంకర్లు

సత్తాచాటిన మహేశ్ భాగవత్ స్టూడెంట్స్

- కృతజ్ఞతలు తెలిపిన సివిల్స్ ర్యాంకర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ ఏడీజీ మహేశ్ భాగవత్ దగ్గర సివిల్స్ ఇంటర్వ్యూ కోసం శిక్షణ పొందిన అభ్యర్థులు సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటారు. టాప్-100లో సుమారు 15 మంది అభ్యర్థులు నిలిచారు. వరుసగా 3, 5, 9, 16, 39, 42, 50, 51, 61, 67, 74, 80, 81, 82, 100 ర్యాంకులు సాధించారు. మంగళవారం అభ్యర్థులు డీజీపీ కార్యాలయంలో ఏడీజీ మహేశ్ భాగవత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి ఇద్దరు..

సివిల్స్ ఫలితాల్లో రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి సివిల్స్ శిక్షణ పొందినవారిలో కే ప్రణయ్‌కుమార్ 554వ ర్యాంకు, కే శశికాంత్ 891వ ర్యాంకుతో అర్హత సాధించారు. దీంతో వారికి ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ శ్రీధర్ అభినందనలు తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి ఐదుగురు ఇంటర్వ్యూ వరకు అర్హత సాధించినట్టు టీఎస్ఎస్‌సీఎస్ డైరెక్టర్ పేర్కొన్నారు. వీరిలో ప్రణయ్‌కుమార్, శశికాంత్ ర్యాంకులు కైవసం చేసుకున్నట్టు చెప్పారు.

ఐపీఎస్ సాధించిన హెడ్‌కానిస్టేబుల్ బిడ్డ



బోనకల్లు, ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం-ఎల్ గ్రామానికి చెందిన రావూరి సాయి అలేఖ్య ఆలిండియా 938వ ర్యాంకు సాధించింది. అలేఖ్య తండ్రి ప్రకాశ్‌రావు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా ఉన్నారు.

నాన్న కోరికను నెరవేర్చా :

చిన్ననాటి నుంచి బాగా చదివి ఐఏఎస్, ఐపీఎస్ కావాలని మా నాన్న చెప్పుండేవారు. ఇంటర్ తర్వాత బీటెక్ కాకుండా డిగ్రీ చదివాను. సివిల్స్ సాధించి నాన్న కోరిక నెరవేర్చడం ఎంతో ఆనందంగా ఉన్నది. *-సాయి అలేఖ్య*

స్కూల్ బస్సు చక్రాల కింద నలిగిన చిన్నారి

మల్యాల, ఏప్రిల్ 16 : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని మద్దుట్ల గ్రామానికి చెందిన ఏడాదిన్నర చిన్నారి మంగళవారం ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మద్దుట్లకు చెందిన రజాక్-హసీనా దంపతులకు ఐదేండ్ల కొడుకు సాజిత్, ఏడాదిన్నర అరీబా ఉన్నారు. సాజిత్ రామన్నపేటలోని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుచున్నాడు. హసీనా కొడుకును బడికి పంపేందుకు స్కూల్ బస్సు వద్దకు కూతురు అరీబాతో కలిసి వచ్చింది. బస్సు ముందుకు కదలడంతో పక్కనే ఉన్న అరీబా పైకి బస్సు టైర్ ఎక్కింది. దీంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇంటర్వ్యూ సమయంలో తల్లి మృతి..

- దుఃఖాన్ని దిగమింగి సివిల్స్‌లో ఒడిశా వాసి రెండో ర్యాంకు

భువనేశ్వర్, ఏప్రిల్ 16: జీవితంలో అత్యంత ప్రధాన ఘడియలలో విధి విషాదాన్ని మిగిల్చినా, దానిని దిగమింగుకుని మొక్కవోని పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు ఒడిశాకు చెందిన 24 ఏండ్ల అనిమేశ్ ప్రధాన్. మంగళవారం ప్రకటించిన సివిల్స్ పరీక్షలో రెండో స్థానంలో నిలిచి భేష్ అన్పించుకున్నాడు. తొమ్మిదేళ్ల వయసులోనే తండ్రిని పోగొట్టుకున్న అనిమేశ్ సరిగ్గా సివిల్స్ ఇంటర్వ్యూ సమయంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న తల్లి కన్నుమూసింది. అంతటి విషాద స్థితిలోనే బాధను భరిస్తూ లక్ష్య సాధన దిశగా సాగిపోయాడు. తొలి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడమే కాక, దేశంలోనే రెండో స్థానంలో నిలిచాడు. అనుగుల్ జిల్లా తాల్చేర్‌కు చెందిన ప్రధాన్ కేంద్రీయ విద్యాలయంలో అనిమేశ్ చదివాడు. రూర్కెలాలోని ఎన్ఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేశాడు.

శాంతి 70 ఎ/సి - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

PVR ఆర్.కె - బంజారాహిల్స్ 4.50PM	INOX ఎం.పి.మాల్ - కాచిగూడ 1.40PM
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.15PM	INOX సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ 4.30PM
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 1.55PM	INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ 1.35PM
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 11.00PM	మిరాజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 5.20PM
PVR గలేరియా - పంజాగుట్ట 1.25PM	మిరాజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 5.20PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.35PM	మిరాజ్ సినిమాస్ - చందానగర్ 2.40PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 1.55PM	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 4.40PM
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి 4.30PM	లక్ష్మీనరసింహ - మియాపూర్ 4.40PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 4.15PM	AMR ఎఎంఆర్ - మౌలాలి 11.30AM
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి 4.15PM	AMB ఎఎంబి - గచ్చిబౌలి 4.25PM
PVR ఎస్2 ఎ/సి - మల్లాపూర్ 4.30PM	GP జిపిఆర్ - కూకట్‌పల్లి 10.15AM
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 10.40PM	సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.40PM
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 5.00PM	GLOBAL CINEMAS LLP